## సింగిల్ పేజీ కథలు

# కూ..టక్ టక్

**ఉసూరంది మనసు రేఖకు. అనుకున్నాను. అప్పుడే అనుకున్నాను. పొద్దున్నే బయలుదేరే సమయానికి, ఆ పక్క ఫ్లాటావిడ గేటు దగ్గర ఎదురు పడగానే 'అయ్యింది. నా పని యివాల్టికి!' అని. ఈ పూటకింతే! తెల్లారుఝామున్నే లేచి వంటపనీ-తనపనీ గబగబా ముగించుకుని లంచ్‌బాక్స్ సర్దుకుంటూ వుంటేనే ఉదయతరంగిణిలో అనౌన్సర్ పాట కూడా మొదలెట్టేసింది.**

గబగబా దేవుడికి అగరొత్తీ, దీపాలూ వెలిగించి 'క్షమించేసుకోబాబూ, ఈ పూటకి' అంటూ దీనాతిదీనంగా వేడుకుని, డ్రెస్ మార్చుకుని కైనటిక్ కీ అందుకుని, యిల్లు లాక్ చేసి కిందికొచ్చానో లేదో, గేట్ దగ్గరావిడ తయార్! ఇంత పొద్దున్నే ఎవరికోసం ఎదురు చూస్తోందో! ట్రైన్ దొరుకుతుందో లేదో! రేఖకెందుకో ఆ పక్కింటావిడని చూస్తే పడదు. అన్ని విషయాలూ తనకే కావాలి. అన్నీ ఆరాలు తీస్తూ, ఏదో సి.ఐ.డి.లాగా అడుగుతూ వుంటుంది. తానలా కాదే! తనకెంత అవసరమో, అంత వరకే మాట్లాడి, తీయటి నవ్వొకటి పారేసి, వచ్చేస్తుందే, మరికొంతమందికి ఎక్కడలేని క్యూరియాసిటీ.

ఆలోచనల మధ్యే స్టేషన్ చేరుకుంది. కైనటిక్ పార్క్ చేసి స్టేషన్లోకి ప్రవేశిస్తోందో లేదో, యింతలోనే అనౌన్స్‌మెంట్ 'ఫలానా ట్రైన్, ఫలానా ప్లాట్ ఫారం నుంచి బయలుదేరుటకు సిద్ధముగానున్నదీ!' అంటూ.

· రేఖ అడుగులు చక చకా పడుతున్నాయి. ఆ ...హమ్మయ్యా.. ఇదిగో లేడీస్ కోచ్ యివాళ కాస్త ఖాళీగానే వుంది. సీటు కూడా దొరికేలా వుంది. 'ఏమి నా భాగ్యమూ?' హుషారుగా లోపలికి ప్రవేశించింది రేఖ. ఓ ముసలాయన! సీనియర్ సిటిజన్స్‌ని లేడీస్ క్యూలలో అలా చేస్తున్నారు కాబట్టి పోనీలేపాపం! ఆయన పక్కనే చోటుంది. రేఖ ఆ జాగాలోనే సర్దుకుని కూచుంది.

మరోసారి అనౌన్స్‌మెంట్ తరువాత రైలు నెమ్మదిగా కదిలింది. తాను కూర్చున్న చోట చుట్టూ ముఖాలను పరికించింది రేఖ. ఓ తల్లీపిల్లా, ఓ తల్లీ కొడుకూ, వాడికో పదహారేళ్ళుంటాయి కాబోలు. వాడి చూపులే భయం భయంగా వుండి పట్టించేశాయి. పాపం మెంటలీ రిటార్డెడ్ అని..లేడీస్ కోచ్‌లో..తల్లితో పాపం..అలాంటి కుర్రాడు!

రైలు వేగం పుంజుకుంటూ వుంది. టైం పాస్ కోసం తెచ్చుకున్న బుక్ ఓపెన్ చేసింది. ఇంతలో ఎంట్రెన్స్ దగ్గర కేకలు...''యిది ఆడవాళ్ళ పెట్టె బాబూ! జెంట్స్ ఎక్కకూడదు దిగండి దిగండి!'' అని ఒకావిడ గట్టిగా దబాయిస్తూంది. ''రన్నింగ్ ట్రైన్లో ఎక్కానండీ! వచ్చే స్టేషన్లో దిగిపోతానంటున్నాగా!'' అంతకంటే గట్టిగా ఓ మగగొంతు..ఇది మామూలే!

అలాంటప్పుడు ఎక్కినవాళ్ళు కాస్త రిక్వెస్టింగా చెబితే బాగుంటుంది గానీ, వాళ్ళూ దబాయింపుగా మాట్లాడితే చిర్రెత్తుకొస్తుంది మరి!

ఈ ఆలోచనల్లో రేఖ కాగితాలు తిరగేస్తూ వుందో లేదో, తననెవరో పక్కనుంచి గమనిస్తున్నట్టనిపించింది. తలెత్తి చూసింది. రన్నింగ్ ట్రైన్లో ఎక్కానని సంజాయిషీ యిచ్చిందితడే ననిపించింది. చెక్స్ షర్టు. షేవింగ్ చేయని గడ్డం. కరుకు చూపులు, భుజానికో బ్యాగ్..యిబ్బందిగా కదిలింది రేఖ! యివన్నీ మామూలే ఐనా, లేడీస్ కోచ్ లోనూ, ఈ చూపులు ఎదుర్కోవాలంటే బాధనిపించదూ! కనీసం యిక్కడా, ప్రైవసీ లేకపోతే ఎలా! బాటిల్‌లోంచి నీళ్ళు తాగి, మళ్ళీ పుస్తకంలోకి దృష్టి సారించింది రేఖ!

అసలు యిలా లేడీస్ కోచ్‌లో ఎవరైనా ఎక్కితే, ఎంట్రెన్స్ దగ్గరే నిలబడి, నెక్స్ట్ స్టాప్‌లో పక్క కంపార్ట్‌మెంట్‌కి వెళ్ళిపోవాలిగానీ..యిలా లోపలికి రావటమే కాక ఆడవాళ్ళని ఇలా పరీక్షగా చూడటమేమిటి, అమర్యాదగా! యధాలాపంగా కంపార్ట్‌మెంట్ అంతా కలియ జూస్తున్నట్టు, మళ్ళీ ఆ శాల్తీవైపు చూసింది రేఖ. కాస్త దూరంగా, కార్నర్ సీట్‌లో కూర్చున్న ఓ పడుచుపిల్లను గమనిస్తున్నాడా చెక్స్‌షర్ట్. రేఖకు ఒళ్ళు మండింది.

వీడికిదేం బుద్ధి! చూస్తే గూండాలాగానే అనిపిస్తున్నాడు. కాస్త ముందుకెళ్ళి నుంచున్నాడు. చూస్తుండగానే అవతలే కూచున్నట్టుంది. యిందాకా వీడితో ''ఏంటి బాబూ! ఏదో ఎక్కితే ఎక్కావు. అక్కడే వుండి పక్క స్టేషన్లో దిగిపోవాలిగానీ..లోపలి దాకా రావటమేమిటి?'' మరో ఆవిడ ఆవిడకి సపోర్ట్ పలికింది. మాటా మాటా పెరుగుతోంది. 'నేనూ గొంతెత్తితే' రేఖ ఆలోచిస్తోంది.

ఇంతలో, పక్కనున్న ముసలాయన కాస్త తనవైపు జరిగినట్టనిపించి, చివ్వున తల తిప్పింది. సీట్ చివర్న, మరో చెక్స్‌షర్ట్ సర్దుకుని కూచుంటున్నాడు. 'అమ్మో! వీళ్ళిద్దరూ ముందుగా అనుకునే ఎక్కినట్టున్నారీ బోగీలో! ఏ టెర్రరిస్టులో కాదు గదా!' ఆమధ్య బోగీలో నిప్పుపెట్టిన వార్త గుర్తొచ్చి భయం వేసింది రేఖకు. అంతలోనే అంతరాత్మ ఎగతాళి చేసింది. 'ఆమాత్రం దానికే భయపడితే ఎలా? ఆడవాళ్ళందరూ ఏకమై గోల చేస్తే వాళ్ళని వెళ్ళగొట్టడం ఎంతసేపు?' అని. నిజమే! చుట్టూ చూసింది రేఖ. 'ఇదంతా మామూలే!' అని తమకు పట్టనట్టు, కిటికీలోంచీ చూస్తున్నారు కొందరు. కొంతమంది ఇబ్బందిగా కదుల్తున్నారు. 'ఇదీ! ఇదే మనలో లోపం. యిలాంటిదేదైనా జరిగితే అందరూ ఒకేలా రియాక్ట్ అవరు!' 'ఆ పోనీలెండి పాపం! రన్నింగ్ ట్రైన్లో ఎక్కారు. పక్క స్టేషన్లో దిగిపోతారు. దీనికింత రాద్ధాంతం ఎందుకూ!' అని సాగదీస్తారు కూడా.

ఇంతలో టక్ టక్ మంటూ శబ్దం మొదలైంది. ఖాళీ బాటిల్‌ని నొక్కుతూ వదుల్తూ వుంటే వచ్చే శబ్దమది. ఆ చెక్స్‌షర్టతడు. సందేహం లేదు. ఆ కార్నర్ సీట్లోని పడుచు పిల్ల దృష్టిని ఆకర్షించేందుకే వీడీ పని మొదలెట్టి వుంటాడు. రేఖ నెమ్మదిగా కళ్ళు తెరిచింది. 'వూ..వాడే! సీటు నానుకుని నిల్చుని, కిటికీలోంచీ తొంగి చూస్తూ, బాటిల్ టకటకలాడిస్తున్నాడు! ఆ టకటక వింటుంటే రేఖ రక్తం కుతకుత లాడిపోతూంది. గబుక్కున వెళ్ళి, వాడి చేతిలో బాటిల్ లాక్కుని అవతల పడేస్తేనో! వాడు ఎదురు తిరిగితే?' రేఖ ఆలోచిస్తోంది. చుట్టూ చూసింది. ఈ శబ్దానికి అలవాటు పడ్డట్టు ఆడవాళ్ళంతా ఎవరి లోకంలో వారున్నారు.

కళ్ళు మూసుకుని ఆలోచిస్తున్న రేఖను డిస్టర్బ్ చేశాయి- ఖాళీ బాటిల్ టకటకలు. ఈసారి ఒకటి రెండింతలుగా కర్ణపుటాలు బద్దలయ్యేలా, రైలు శబ్దం కంటే ఎక్కువగా అనిపిస్తున్నాయవి. 'ఇహ లాభం లేదు ఈ చెక్స్‌షర్ట్ శాల్తీని ఎలాగేనా ఆపి తీరాలి. నానా యాగీ చేసి, టి.సి.ని పిలిపించి, వీణ్ణీ, వీడి ఫ్రెండ్‌నీ దింపెయ్యాలి. వీళ్ళిద్దరి భరతం పట్టాల్సిందే!' కోపంగా కళ్ళు తెరిచి, ఆవైపు చూసింది రేఖ. ఇద్దరూ లేరు. మరి శబ్దం ఎట్నించీ వస్తూంది? ఎదురుగా కార్నర్ సీట్లో, తల్లీ, ఆమె కొడుకు. ఆ పిల్లాడి అల్లరి మాన్పేందుకై ఖాళీ బాటిల్ యిచ్చినట్టుందా తల్లి. ఆ చెక్స్‌షర్ట్ వాణ్ణే గమనించి, వాడి విద్య వీడు పట్టే

సినట్టున్నాడు. ఆ శబ్దాన్ని పుట్టించిన తన గొప్పద నాన్ని చుట్టూవున్న వాళ్ళు పరికిస్తున్నారా లేదా అని మెరిసే కళ్ళతో చుట్టూతా చూస్తూ ఆ కుర్రాడు. అరె! ఆ చెక్స్ షర్ట్‌లు వెళ్ళిపోయాయన్న మాట. 'ఆలోచనల్లో వేగిపోయానేకానీ, ఏమీ చేయలేకపోయానన్న బాధ రేఖ ముఖంలో ప్రతిఫలించింది. ప్చ్. వూరికే అన్నారా! ఈ రైలెప్పుడూ జీవితకాలం లేటూ! అని' గుర్తు చేసుకుంటూ బ్యాగ్ సర్దుకుంది, తన స్టేషన్ వస్తున్న విషయం గమనించి.

**-నాగపద్మిని**

# ఓదార్పు

**"మమ్మీ ఈసారి సైన్సులో మార్కులు తక్కువగా వచ్చాయి మమ్మీ" ప్రోగ్రెస్ రిపోర్ట్ తల్లి చేతికిస్తూ దిగాలుగా అంది ప్రియ.**

**"ఏమిటే ఈ మార్కులు ఇంత తక్కువగా వచ్చాయి" కోపంగా అడిగింది వసుంధర.**

''మమ్మీ చెస్ టోర్నమెంట్ వుండటం వలన చెస్ ప్రాక్టీస్ చేస్తూ సరిగ్గా చదవలేకపోయాను'' అంది తొమ్మిదవ తరగతి చదువుతున్న ప్రియ.

''నీకు ఆటల్లో వుండే శ్రద్ధ చదువులో వుండటం లేదే'' కసురుకుంది వసుంధర.

''మమ్మీ మరోసారి మంచి మార్కులు తెచ్చుకుంటాను మమ్మీ'' బ్రతిమాలుతున్న ధోరణితో అంది.

''ఒళ్ళు దగ్గర పెట్టుకుని చదివితే ఎందుకు రావే మార్కులు'' ప్రోగ్రెస్ కార్డ్ విసురుగా ప్రియ చేతిలో పెట్టింది. తల్లి గట్టిగా మందలించేసరికి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి ప్రియకు.

''పోనీలే వసూ, చెక్ ప్రాక్టీస్ చేస్తే మంచిదే. టోర్నమెంట్‌లో గెలిస్తే మంచి పేరు వస్తుంది'' అన్నాడు వసుంధర భర్త ప్రసాద్.

''మీరిలా ప్రతిదానికి వెనకేసుకు రాబట్టే అదిలా చదువులో వెనకపడుతోంది'' కోపంగా భర్తమీద కేకలేసింది.

''సర్లే వూరుకో. తను ఎప్పుడూ మంచి మార్కులే తెస్తుంది కదా. ఈసారికి వదిలేయి'' భార్యని మందలించాడు. భర్త వంక కోపంగా చూస్తూ లోపలికెళ్ళిపోయింది. అమ్మ తిట్లు తిని అలసిపోయిన ప్రియ నెమ్మదిగా జారుకుంది. లోపల పనిచేసుకుంటున్న భార్య దగ్గరకు వచ్చాడు ప్రసాద్.

''వసూ, పిల్లల్ని అలా కోప్పడితే ఎలా చెప్పు. వాళ్ళకి మెల్లగా సర్దిచెప్పి, మనమే చక్కగా తీర్చిదిద్దుకోవాలి. అలా కసురుకుంటే వాళ్ళు పెంకిగా తయారవుతారు. ప్రియ మొద్దుపిల్ల కాదు. చక్కగా చదువుతుంది. ఈసారి కాకపోతే మరోసారి మంచి మార్కులు తెచ్చుకుంటుంది. నువ్వు కోప్పడినందుకు చూడు తన ముఖం ఎలా పాలిపోయిందో'' సర్ది చెబుతున్న భర్త వంక సూటిగా చూసి మౌనంగా వుండిపోయింది.

★ ★ ★

''ఏయ్ వసూ! నువ్వు రాసిన కథ తిరిగి వచ్చేసింది'' నవ్వుతూ భార్య చేతిలో కవరు పెట్టి ఆఫీసుకు వెళ్ళిపోయాడు ప్రసాద్. తను రాసిన కథ తిరిగి వచ్చినందుకు బాధగా అనిపించింది వసుంధరకు. కథ తిరిగి వచ్చిందన్న బాధ కన్నా తన భర్త వెటకారంగా నవ్వినందుకు మనసు చివుక్కుమంది. 'నీకెందుకోయ్, కథలు కాకరకాయలు, ఇంట్లో పని చూసుకోకుండా' అన్నట్టుంది ఆ నవ్వుకు అర్థం. తనకు కథలు రాయాలని ఆసక్తి వుండటంతో రాసి పంపింది. ఫలితంగా అది తిరిగి వచ్చింది. ఆలోచిస్తూనే వంటయిందనిపించి అలసటగా వచ్చి సోఫాలో కూర్చుండిపోయింది. ఇంతలో ప్రియ స్కూలు నుండి వచ్చి బ్యాగ్ టేబిల్ మీద పెట్టి అమ్మ దగ్గరకు వచ్చి కూర్చుంటూ ''ఏమిటి మమ్మీ డల్‌గా వున్నావు'' అనడిగింది.

''ఏమీ లేదు'' మెల్లగా జవాబిచ్చింది.

''ఏం మమ్మీ ఒంట్లో బాగాలేదా'' ఆప్యాయంగా అడిగింది.

''ఏం లేదమ్మా నేను రాసిన కథ తిరిగి వచ్చేసింది'' అంది.

''ఓ అదా టేకిటీజీ మమ్మీ. ఈసారి కాకపోతే మరోసారి తప్పకుండా పడుతుంది. తిరిగి వచ్చేసిందని నువ్వు రాయటం మానేయకు, నీ ప్రయత్నం నువ్వు చెయ్యి. బెటర్ లక్ నెక్స్ట్ టైమ్. నువ్వు అలా డల్‌గా వుంటే బాగుండదు మమ్మీ'' ఆప్యాయంగా తల్లి భుజం నొక్కుతూ అంది. వసుంధరకు తన కూతురిచ్చిన ఓదార్పు వేసవితాపంలో చల్లటి గాలిలా తగిలింది. వసుంధరకు నిన్న జరిగింది గుర్తుకు వచ్చింది. నిన్న మార్కులు తక్కువ వచ్చాయి అని తను అన్నప్పుడు ఇదే ఓదార్పు తనిచ్చివుంటే, ఎంత సంతోషపడేదో. చిన్నపిల్లకున్న ఇంగితం కూడా తనకు లేకపోయినందుకు, బాధపడింది. శ్రీవారు వెక్కిరింతగా నవ్వటం తప్పుకాదనిపించింది వసుంధరకు, ఆ సమయంలో.

పెద్దవాళ్ళు పిల్లలకు నీతులు చెబుతుంటారు. కానీ ఒక్కోసారి ఆ పెద్దవాళ్ళే పిల్లల దగ్గర కొన్ని విషయాలు నేర్చుకోవాల్సి వుంటుంది అనుకుంది. ఇప్పుడు వసుంధరకు కథ తిరిగి వచ్చిందన్న బాధకంటే, తన కూతురిచ్చిన ఓదార్పు వేయిరెట్లు సంతోషం కలిగించింది. నవ్వుతూ ఆప్యాయంగా కూతురి బుగ్గ నిమిరింది. తల్లిముఖంలో సంతోషం కనిపించటంతో లేడిలా గెంతుతూ తుర్రున పారిపోయింది ప్రియ.

**-ఎస్.కె.సన్ని (శ్రీకాళహస్తి)**




